# రాచకొండ

1970 అక్టోబరు మూడవ వారంలో ఒక బుధవారం నాడొక మిత్రుడు ఫోన్‌మీద — “రాచకొండ విశ్వనాధశాస్త్రిగారు ఢిల్లీకి వస్తున్నారు” అని చెబితే పరమానందం కలిగింది.

ఆ మరునటిరోజు ఇక్కడి “తెలుగుసాహితివారు, ఆంధ్రప్రదేశ్ సమాచార కేంద్రంవారు కలిసి ఏర్పాటుచేసిన సమావేశంలో ఆ కథక చక్రవర్తిని చూడడం. వినడం జరిగాయి. కేవలం ఆయన కథలు చదివినవారు శ్రీ రావిశాస్త్రిని ఒక “Angry man లా ఊహించుకోవడం తథ్యం. కాని నిజానికి శాస్త్రిది చాలా సౌజన్యమైనమూర్తి అంటే ఆయనలో కొడవటిగంటి వారు రచయితల లక్షణంగా నిర్వచించిన “కసి” లేదనికాదు : బోలెడంత వుంది. అది ఆయన రచనల్లో కనబడుతుంది.

ఆనాటి సమావేశంలో అల్పాహార విందు స్వాగతాలు అయ్యాక కొందరు సభ్యులు ప్రశ్నలు వేయడంతో శాస్త్రిగారు నెమ్మది నెమ్మదిగా మౌనం నుండి బయటకు రాసాగారు. నిదానమైన ఆధోరణిలోనే మధ్య మధ్య రాచకొండ మార్కు మెరుపులు మెరిశాయి.

ఆయన్ను “కమిట్ మెంట్” గురించి అడిగిన ప్రశ్నలకు శాస్త్రి సమాధానం : “మనం ఎందుకు రాస్తున్నాం. ఎవరికిరాస్తున్నాం అన్న దానిని బట్టి రచన వుంటుంది, మధ్యాహ్నం పూట తీరికగావుండే ఆడువారి ఆనందంకొరకు రాయుట” అన్నది ధ్యేయంగా పెట్టుకుంటే ఒక రకం

రచనలు వస్తాయి, "పులులూ - మేకలూ గురించి రాయాలంటే ఇంకో రకం రచనలు వస్తాయి, మార్క్స్ ఊహించిన సోషలిస్టు సమాజం ఎన్న దగిన ఆశయం అనిపించింది. ఆ సమాజం కోసం నేటి తరంవారు ఉరకలెత్తుతున్నారు. ప్రాణాలు సైతం అర్పిస్తున్నారు. అట్టి ఆశయం దృష్టిలో పెట్టుకుని రాయడం జరుగుతుంది."

పీడిత జనావళి సంకెలలు విడిపించదలచుకున్న రచయిత ఈ "ఇజాల సంకెళ్లు తగిలించుకోవడం సరైన పనేనా?" అన్న ప్రశ్నకు రావిశాస్త్రి — "అంతా "ఉపమానం" మీద వుంది. మీరు దాన్ని సంకెళ్లు అన్నారు నేను దానినొక "బాట" గా వర్ణిస్తాను.

"ఆ బాట సరయినదే అంటారా?"

"కావచ్చు. దేవుడున్నాడు అంటూ ఇన్నాళ్ళురాశారు కదా, దేవుడు లేడు అంటూ ఇప్పుడు రాస్తున్నారు. ఏమో, ఇదే నిజం కావచ్చుగదా!"

ఇంకో సభ్యులు "రచన అన్న దానికి రచయిత ఆత్మానుభూతి ఆధా రం! మరి ఈ మార్క్సిజం వంటివి బాహ్యమైన యదార్థాలు, ఈ రెంటికీ సమన్వయం ఎట్లా కుదురుతుంది?" అని అడిగితే — "నా అనుభవంలో ఆ రెంటికీ సమన్వయం కుదరకపోవడం జరగలేదు అని శాస్త్రి సమాధానం ఇచ్చారు.

దానిమీద మరో ప్రశ్న వచ్చింది. "ఒకవేళ ఆరెండింటికి సమ న్వయం కుదరని దినంవస్తే అప్పుడు మీ ధ్యేయం మార్చుకుంటారా లేక రచనలు మానేస్తారా?"

"ఏం మూడోదారి లేదా? ఆత్మహత్య చేసుకోవచ్చుగా —" అన్నారు శాస్త్రి.

అభ్యుదయ రచయితల సంఘంగురించి తనకు ఎక్కువ తెలియదని, విప్లవ రచయితల సంఘం అని ప్రారంభిస్తున్నాము చేరుతావా అని అడిగితే చేరతానన్నాననీ శాస్త్రి అన్నారు.

'మరి వి. ర. సం, సభ్యులుగా మీరు విప్లవానికి నిజంగా తోడ్పడుతున్నాననే అనుకుంటున్నారా' అని అడిగిన దానికి ఆయన — "యుద్ధం జరుగుతోందనుకోండి, సైనికులు రణరంగంలో పోరాడుతుంటారు. ప్రాణాలు అర్పిస్తుంటారు. అప్పుడు ఇళ్ళదగ్గర కూచుని ఆడవాళ్లు మేజోళ్లు అల్లుట, "చందాలు సేకరించుట" వంటివి చేస్తుంటారు. మరి వాళ్ళు యుద్ధానికి సాయంచేస్తున్నట్లే కదా .... మమ్మలనూ ఆవిధంగా మేజోళ్లు అల్లువారు"గా తీసుకోండి .... "

"మిమ్మల్ని ప్రభావితం చేసిన రచయితలు ఎవ్వరు ?"

" ఓహెన్రీ, చెకోవ్, మసాసా !"

"మీకు నచ్చిన తెలుగు రచయితలు?"

"నాకు తెలుగు పత్రికలూ అవీ చదివే తీరికే లేదు. అసలు ఈ న్యాయవాద వృత్తి వదిలిపోయిగా ఏభూమినో దున్నుకు బ్రతకాలని వుంది నాకు తెలుగురాదు. ఎందుకంటే మొదటిఫారం చదువుతుండగా ఫెయిలయ్యాను. మళ్ళీ అదేఫారంలో అదే "ఎ" డివిజన్‌లో చదవాలంటే చెడ్డ సిగ్గేసింది. అంచేత "బి" డివిజనుకు మారాలనుకున్నాను. సంస్కృతం రెండవ భాషగా తీసుకున్నాను. ఆటోమాటిక్ గా "బి" డివిజన్‌లోకి మార్చేశారు. చూశారా ! ఆవిధంగా అటు తెలుగూ పోయింది ; ఇటు సంస్కృతమూ రాలేదు."

తన కథల గురించి సభ్యులు పదేపదే అడగ్గా రావిశాస్త్రి "ఆ .... ఏదో రాశాం, అయిపోయింది, నేనేం ఉత్తమ రచయితనుకాను, గొప్ప రచ

యితను కాను. ఏదో రాశాను, అవి ఏలాంటివో కాలం చెబుతుంది" అన్నారు.

ఆ మరునాడు ఇంకో మిత్రుడింట్లో విశ్వనాథ శాస్త్రిగారితో రెండు గంటలపాటు సాహిత్య ప్రియులు ఇష్టాగోష్ఠిగా కాలక్షేపం చేయగలిగారు. ఆయననాటకం "నిజం" హిందీలోకి అనువదింపబడుతోందనీ ప్రదర్శింపబడ డానికిప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిసి సంతోషం కలిగింది.

కాని "ది గ్రేటెస్టు సర్ప్రైజ్" — విశ్వనాథశాస్త్రిగారికి జాతకాల మీద నమ్మకం వుండడం !

(20 నవంబర్ 70)